




*(గత సంచిక తరువాయి)*

నెలరోజుల క్రితం షీలా ముఖర్జీని మానభంగం చేసి, ఘాతుకంగా హత్య చేసిన నేరం మోపబడిన శిఖామణిని పట్టుకోవడం కోసం పోలీసుల ప్రయత్నం నిన్న అంతం అయింది.

మద్రాసు నగరంలో శిఖామణిని స్థానిక పోలీసుల అరెస్టు చేసిన కానిస్టేబుల్స్ యిద్దరూ, అల్వరసు, దండాయుధం. యాభయివేల రూపాయలు యీ యిద్దరికీ సరిసమానంగా పంచబడిందని మద్రాసు ఐ.జి. చెప్పారు.

అరెస్టు వివరాలు:

నిన్నరాత్రి పదిగంటల ప్రాంతాల, సినిమాకి వెళ్ళి యింటికి తిరిగివస్తున్నారు కామరాజ్‌నగర్‌లో వుంటున్న దంపతులు. కొత్తగా ఏర్పడిన కాలనీ, విశాలమైన రోడ్లు, దూరదూరంగా యిళ్ళు. బస్‌స్టాప్ నించి కొంత దూరం వచ్చిన తర్వాత పక్క వీధిలోంచి సైకిల్‌మీద ఒకతను వచ్చి, వాళ్ళకెదురుగా ఆగి, బాకు చూపించి, ఆ స్త్రీ వొంటిమీద వున్న నగలు, అతని జేబులో వున్న పర్సు యివ్వమని బెదిరించాడు. ఆ దంపతులు బెదిరిపోయి వాటిని తీసియిస్తున్నారు. అంత తెలివైన, అన్ని దొంగతనాలు చేసిన శిఖామణి గుర్తించనే లేదు. తను దొంగతనం పోలీస్‌స్టేషన్ ముందు చేస్తున్నాడని. పోలీస్ స్టేషన్ వసారాలో వున్న కానిస్టేబుల్స్ దండాయుధం, అల్వరసు అది చూసి వెళ్ళారు. పోలీసులని చూడగానే శిఖామణి దౌడు తీశాడు. దండాయుధం, అల్వరుసు పరిగెత్తారు. అంతేకాక, రోడ్ పక్కనవున్న రాళ్ళని తీసి శిఖామణి మిదికి విసిరారు. శిఖామణి రివాల్వర్ తీసి వెనక్కి పేల్చాడు. అయినా దండాయుధం, అల్వరుసూ భయపడి వేట మానలేదు. పోలీసులనించి తప్పించుకోవాలనే ఆత్రుతలో ముందు ఏమున్నదో చూసుకోకుండా వేగంగా సైకిల్ తొక్కడంలో, శిఖామణి మలుపు చూసుకోలేదు. వీధి పక్కనున్న వెడల్పయిన నీళ్ళులేని, కాలువలో సైకిల్‌తో సహాపడ్డాడు. వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్ శిఖామణిని పట్టుకుని, పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చారు. పోలీస్ స్టేషన్‌లో దీపాల కాంతిలో చూశాక, అతను శిఖామణి అని గుర్తుపట్టి, వెంటనే పై అధికారులకి తెలియజేశారు. శిఖామణిని బొంబాయి తీసికెళ్ళేందుకు బొంబాయి పోలీసు అధికారులు రేపు బయలుదేరి వస్తున్నారు."

ప్రజలు నిట్టూర్చారు. పోలీసులు ఊపిరి తీసుకున్నారు.

పత్రికలు పోలీసులని పొగిడాయి.

షీలాముఖర్జీని మానభంగం చేసి, హత్యచేసిన నేరం బొంబాయి మేజిస్ట్రేటు కోర్టులో శిఖామణి మీద ఆపాదించబడింది.

7

"రండి కూర్చోండి" అన్నాడు డిటెక్టివ్ యుగంధర్.

బెదురుతూ చుట్టూ చూసింది ఆమె. యుగంధర్ అసిస్టెంట్ రాజు కుర్చీలాగాడు. ఆమె యింకా కూర్చోలేదు.

"నేను యిక్కడికి వచ్చినట్టు తెలిస్తే"

"తెలిస్తే?" అడిగాడు యుగంధర్.

"నాకు చావు తప్పదు" అన్నదామె.

"భయంలేదు. మీరు యిక్కడికి వచ్చినట్టు ఎవరికీ మేము చెప్పము. కూర్చోండి. అసలు విషయం ఏమిటో చెప్పండి" అన్నాడు యుగంధర్

అప్పటికీ ఆమె కూర్చోలేదు, "ఏమో! నేను పొరపాటు చేశానేమో మీరూ వాళ్ళలో ఒకరేగా" అన్నది.

యుగంధర్ ఆమెని పరీక్షగా చూశాడు. ముప్పయి ఏళ్ళ లోపున ఉంటుంది. అందంగా ఉంది. నడకలో, నిలుచోవడంలో, మాటలో వొయ్యారం. తను ఆడదనీ, తన ఆకర్షణకి మొగాడు లొంగిపోతాడనీ, అనుక్షణం జ్ఞాపకం ఉంచుకునే స్త్రీ. కానీ, యిప్పుడు అటువంటి ఆలోచన ఆమెలో లేదని తెలుస్తోంది. భయం, ఆదుర్దా, పిరికితనం, నిస్సహాయత్వం గోచరిస్తున్నాయి ఆమె కళ్ళల్లో.

"ఎవరిలో ఒకణ్ణి?" అడిగాడు యుగంధర్. ఆ సమయానికి కాత్యా కూడా వచ్చి ఒక పక్కగా నిలబడింది.

"పోలీసులు"

"నేను పోలీసుని కాను. వాళ్ళల్లో ఒకణ్ణికాను. న్యాయమూ, ధర్మమూ, నీతీ, నిజాయితీ ఎటువుంటే అటుంటాను. వాళ్ళ మనిషిని" అన్నాడు యుగంధర్.

"అని విన్నాను. అందుకే వచ్చాను" అన్నదామె దీనంగా.

"అయితే చెప్పండి మీ సమస్య ఏమిటో?" అడిగాడు యుగంధర్.

ఆమె కూర్చున్నది. అయినా మౌనంగా ఉండిపోయింది.

యుగంధర్ సిగరెట్ వెలిగించాడు.

"ఎలా చెప్పను, యెక్కడ మొదలుపెట్టాలి. అదే తెలియకుండా వుంది" అన్నదామె చీరకొంగు వేళ్ళకి మెలివేస్తూ.

"ముందు పేరు చెప్పండి. మీకు వివాహమైంది. మీ భర్తపేరు చెప్పండి. చిరునామా చెప్పండి. ఆ తర్వాత మిగతా విషయాలు మీరే చెప్పేస్తారు" అన్నాడు యుగంధర్.

ఆమె తల ఊపింది. "నా పేరు రాధ. నా భర్త పేరు శిఖామణి. మేము టి.నగర్‌లో ఉంటున్నాము. షీలా ముఖర్జీ అనే ఆమెని హత్యచేసిన నేరం మోపి నా భర్తని అరెస్టు చేశారు.."

కళ్ళ వెంట నీళ్ళు జలజలా రాలాయి. కాత్యా కాఫీ తెచ్చి బల్లమీద పెట్టింది. శిఖామణి పేరు చెప్పగానే, రాజు యీలవేసి, ఫయిలింగ్ అలమారు దగ్గరికి వెళ్ళాడు.

"మీరు కాఫీ తాగండి. రాజు ఫైల్ తెచ్చిస్తాడు. వివరాలు నేను చదువుకుంటాను" అన్నాడు యుగంధర్. ఆమె తలవూపి కాఫీ కప్పు అందుకున్నది.

రాజు ఫైలు తెచ్చి యుగంధర్‌కి యిచ్చాడు. యుగంధర్ చదువుతున్నాడు. రాజు, కాత్యా వెనక నిలబడి తామూ చదువుతున్నారు. పదిహేను నిమిషాల తర్వాత ఫైలు మూసేసి, "చెప్పండి" అడిగాడు యుగంధర్.

"నా భర్త శిఖామణి దొంగ. చాలా దొంగతనాలు చేశారు. రైళ్ళల్లో, బస్సుల్లో యిళ్ళల్లో. ఈ ఊరిలోనే కాదు, పోలీసులు చెప్పినట్టు చాలా ఊళ్ళల్లో" చెప్పింది ఆమె.

"దొంగతనాలు చేశారేకానీ, దౌర్జన్యానికి మాత్రం ఏనాడూ పూనుకోలేదు. ఒకానొకసారి ఒక స్త్రీ మెళ్ళో బంగారు గొలుసు యివ్వడానికి నిరాకరించి, తిరగబడితే, ముందు కత్తి చూపించి బెదిరించినా, పొడవలేదు. పరిగెత్తుకుని పారిపోయి వచ్చేశారు."

యుగంధర్ తల ఊపాడు.

"మా వారికి రక్తం అంటే భయం. దౌర్జన్యం అంటే భయం. అటువంటి మనిషి యింత ఘాతకమైన పనిచేశారంటే నేను నమ్మను" అన్నది రాధ.

యుగంధర్ నిట్టూర్చాడు. భారత స్త్రీలో ఉన్న గొప్పతనమే అది. భర్త యెంత దుర్మార్గుడయినా భర్తని పూజిస్తుంది. "శిఖామణి దౌర్జన్యానికి పూనుకోరు అన్నారు. అటువంటి మనిషి కామరాజ్ నగర్‌లో, పోలీసులమీద పిస్తోలు యెలా పేల్చారు?" అడిగాడు యుగంధర్.

"అది అబద్ధం. మావారివద్ద పిస్తోలు లేదు" అన్నది రాధ,

"శిఖామణి దొంగతనాలు, దోపిడీలు చేశారని మీరే చెపుతున్నారు. అతని వద్ద పిస్తోలు లేదని మీరు యెలా నిశ్చయంగా చెప్పగలరు. అంతేకాదు శిఖామణి షీలా ముఖర్జీని హత్య చెయ్యలేదనేందుకు, మీ నమ్మకము మాత్రమేనా, వేరే నిదర్శనం ఏమైనా వుందా?" అడిగాడు యుగంధర్.

శిఖామణి చేసి వుండడానికి అవకాశం లేదు. అంతకన్నా నిదర్శనం కావాలా?" అడిగింది రాధ.

"ఈ విషయం మీరు పోలీసులకి చెప్పారా?" అడిగాడు రాజు.

"చెప్పాను. శిఖామణి ఆ తేదీలలో మద్రాసులో ఉన్నట్టు సాక్ష్యం కావాలన్నారు. ప్రస్తుతానికి నా మాట తప్పితే వేరే సాక్ష్యం లేదు."

"అంటే?" అడిగాడు యుగంధర్.

"అక్టోబర్ 4వ తేదీ మధ్యాహ్నం మారువేషంలో, అంటే కూరలు అమ్మే అతని వేషంలో శిఖామణి యింటికి వచ్చారు. అది ఆదివారం కనుక నేను ఇంట్లోనే ఉన్నాను. ఎక్కడో, ఎప్పుడో కొన్ని దొంగతనాలు చేసి, నాలుగు బంగారు గొలుసులు, రెండు రిస్టువాచీలు, మూడు ఉంగరాలు, ఒక డైమండ్ నెక్లెస్ తీసుకుని వచ్చారు. వాటిని వెంటనే అమ్మితే పట్టుబడతాననీ, ఒక్క వారం రోజులు దాక్కోవాలని చెప్పారు. ఇంట్లోంచి కదలలేదు. నేను కాలేజీకి వెళ్ళేటప్పుడు యింటికి తాళం వేసి వెళ్ళేదాన్ని. ఇలా పదిరోజులు గడిచిన తర్వాత, ఒక రాత్రి నగలు తీసుకుని వెళ్ళిపోయారు శిఖామణి. కొన్నిరోజుల తర్వాత పత్రికల్లో చదివాను. శిఖామణి షీలా ముఖర్జీని హత్యచేశాడని. నేను నమ్మలేదు. ఎలా నమ్మను. మనిషి నా యింట్లో నా పక్కన వుంటే పోనీ నేను యింట్లో లేనపుడు వెళ్ళి హత్య చేసి వచ్చాడా అని అనుకునేందుకు, హత్య బొంబాయిలో జరిగింది. అదీ అర్ధరాత్రి. ఆ పదిరోజులూ అర్ధరాత్రుళ్ళు నాతోనే ఉన్నారు."

రెండు నిమిషాలు యుగంధర్ మౌనంగా వుండి "అమ్మా! రాధా! వేలిముద్రలూ హత్య జరిగిన ప్రాంతాల శిఖామణిని చూసిన సాక్ష్యాలు, యిలాటి బలవత్తరమైన సాక్ష్యం వుంటేకానీ పీలీసులు హత్యకేసు కోర్టులో దాఖలు చెయ్యరు. పత్రికల్లో ప్రకటనలని బట్టి, శిఖామణి వేలిముద్రలు ఆ అంబాసిడర్ కారుమీద వున్నాయని, ఆ జేబురుమాలు అతనిదేనని తేలుతోంది. ఆ సాక్ష్యానికీ, నువ్వు చెపుతున్న విషయానికీ యెక్కడా పొసగడంలేదు. అవేరకమైన వేలిముద్రలు యిద్దరి మనుష్యులకి వుండడం అసంభవం అని చదువుకున్న మీకూ తెలుసు. ఏ సాక్ష్యమూ, నిదర్శనమూ లేని నీ మాట, శిఖామణి నీ దగ్గరే ఉన్నాడనే విషయం, యింట్రస్టడ్ పార్టీ సాక్ష్యంగా పరిగణించబడుతుంది. కేవలం మీ మాట కాక వేరే సాక్ష్యం ఏమైనా వుందా? శిఖామణి మద్రాసులో 5వ తేదీ రాత్రి ఉన్నట్లు?" అడిగాడు యుగంధర్.

"ఉన్నది, కాని నిరూపించలేకుండా ఉన్నాను" అన్నది రాధ.

"ఏమిటా సాక్ష్యం? చెప్పు. నిరూపించడానికి నేను ప్రయత్నిస్తాను."

"అక్టోబర్ అయిదవతేదీ, అంటే షీలా ముఖర్జీ హత్య చెయ్యబడిన రోజు రాత్రి ఎనిమిది గంటలకి, శిఖామణి స్నేహితుడు అంటే యింకో దొంగ, పేరు కరుప్పన్ వచ్చాడు. నాకు యిష్టం లేకపోయినా అతన్ని లోపలికి రానివ్వవలసి వచ్చింది. కరుప్పన్ ఒక సీసా బ్రాందీ తీసుకువచ్చాడు. శిఖామణికి తాగుడు అలవాటులేదు. అయినా కరుప్పన్ బలవంతం చెయ్యడంవల్ల, అతనితోపాటు తాగాడు.

అర్ధరాత్రివేళ శిఖామణి వాంతులు చేసుకోవడం ప్రారంభించాడు. నాలుగయిదుసార్లు వాంతులు చేసుకున్న తర్వాత, రక్తం కక్కడం ప్రారంభించాడు. అది కల్తీ బ్రాందీ అయ్యుండవచ్చు అని నాకు భయం వేసింది. శిఖామణిని ఆస్పత్రికి తీసుకెళ్ళేందుకు ధైర్యం చాలలేదు. పైగా మద్రాసులో మధ్యపాన నిషేధం అమలులో వుంది."

"ఏం చేశారు?" అడిగాడు యుగంధర్.

"మా వీధి పక్కవీధిలో ఒక డాక్టర్ ఉన్నారు. పేరు పంకజరావు. మా యింటికి నా మేనమామ కొడుకు వచ్చాడనీ, జబ్బు చేసిందనీ పిలిచాను. ఆయన వచ్చి, పరీక్ష చేసి యింజక్షన్ యిచ్చారు. అలవాటు లేని మనిషి ఎక్కువగా తాగడం వల్ల, అదీ కాళీ కడుపుమీద తాగడంవల్ల అలా వాంతులు వచ్చాయనీ, భయం ఏమీ లేదనీ చెప్పారు. తాగినందుకు పోలీసులకి చెప్పకుండా, ఆయనకి ఒక నూరు రూపాయలు ఫీజు యిచ్చాను."

"అయితే చాలా సింపుల్. ఆ డాక్టర్ సాక్ష్యం చెపితే సరిపోతుంది" అన్నాడు రాజు.

"అవును. డాక్టర్ పంకజరావు అబద్ధం ఆడలేడు. అర్ధరాత్రి ఆయన్ని నేను లేపినపుడు, గేటు జవాను, తర్వాత ఆ యింట్లోనే ఉన్న ఆయన కాంపౌండర్, ఆ తర్వాత ఆయన భార్య, పిల్లలు, అందరూ నిద్రలేచారు, కాని -"

"కాని -?" అడిగాడు యుగంధర్.

"డాక్టర్ పంకజరావు, ఆయన గేటు జవాను, కాంపౌండర్, కుటుంబంతో సహా యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్ళినది తెలుసుకోవడానికి ప్రయత్నించాను. నావల్ల కాకపోయింది."

"పోలీసులు కనుక్కోగలరులే సులభంగా" అన్నది కాత్యా.

"చెప్పానుగా, ఈ హత్య శిఖామణి మీద మోపడమే పోలీసులు ఉద్దేశం అయినపుడు వాళ్ళకి ఏం పట్టింది? నా మాట వినిపించుకోలేదు."

డిటెక్టివ్ యుగంధర్ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"అంతేకాదు యుగంధర్‌గారు ఐ.జి. ఆఫ్ పోలీస్ నన్ను పిలిపించి, శిఖామణిని గురించి గొడవ చెయ్యవద్దనీ, అతన్ని తప్పించడానికి ప్రయత్నించవద్దనీ, అటువంటి ప్రయత్నం చేస్తే, శిఖామణి చేసిన దొంగతనాల నేరాలలో అక్కాంప్లిస్‌గా నామీద కూడా కేసుపెట్టి, జైల్లో పెడతాననీ బెదిరించారు."

"అందుకేనా మీరు రాగానే భయపడ్డారు?" అడిగాడు రాజు.

"అంతేకాదు -" అంటూ ఒక ఉత్తరం తీసి, యుగంధర్‌కి యిచ్చింది.

పావురావు కాయితం మీద టైపు చేసిన ఉత్తరం అది. ఇంగ్లీషులో.

**"శ్రీమతి రాధ,**

శిఖామణికీ, మీకూ సంబంధం ఉన్నట్లు ఎవరికీ తెలియనివ్వకండి. శిఖామణికి సహాయం చెయ్యడానికి పూనుకోవద్దు. అటువంటి ప్రయత్నంచేస్తే షీలా ముఖర్జీకి పట్టిన గతి మీకూ పడుతుంది.

**కసి పెట్టుకున్నవాడు."**

"దొంగతనాలు చేసి సంపాదించిన డబ్బంతా శిఖామణి బాంకిలో వేసుకున్నాడా? ఇంట్లో దాచిపెట్టాడా! మీ పేరున వుండదని నాకు తెలుసు అన్నాడు యుగంధర్.

"మీరు చెపితే నమ్మరు. శిఖామణి ఆ డబ్బు దాచుకోలేదు. ఆఖరికి ఒక రూపాయి కూడా. ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ వద్ద క్యూలో నిలబడ్డ వాళ్ళకి యెవరికీ తెలియకుండా పంచిపెట్టేవారు."

"ఇలా శిఖామణి ఆ డబ్బు నిరుద్యోగులకి పంచిపెట్టినట్టు ఏదైనా సాక్ష్యం ఏమైనా వుందా?" అడిగాడు రాజు.

"ప్రత్యక్ష సాక్ష్యం ఏమీలేదు. శిఖామణి మారు వేషంలో వెళ్ళి, ఆ డబ్బు తీసుకుంటున్న వాళ్ళకి కూడా తెలియకుండా వాళ్ళ జేబుల్లోకి. వాళ్ళవాళ్ళ దగ్గర డబ్బు కవర్లో పెట్టి పడేసేవాడు. శిఖామణి యీ పని చేశాడని నిరూపించలేకపోయినా, ఎవరో అజ్ఞాతంగా అలా డబ్బు పంచిపెట్టినట్టు, దర్యాప్తు చేస్తే తెలుస్తుంది" అన్నది రాధ.

యుగంధర్ మళ్ళీ ఒక సిగరెట్ వెలిగించాడు. ఆలోచిస్తూ పదినిమిషాలు గడిపాడు. "రాధా! నువ్వు అబద్ధాలు చెపుతున్నావని అనిపించడంలేదు. నీ మాటల్లో నిజాయితీ ధ్వనిస్తోంది. కానీ పోలీసులు తగిన సాక్ష్యం లేనిదే హత్యానేరం మోపరు. ఈ రెండూ ఒకదానికి ఒకటి పొసగడంలేదు" అన్నాడు.

"యుగంధర్‌గారూ! శిఖామణి యీ హత్య చెయ్యలేదు. దొంగతనాలు, దోపిడీలు చేశారు. ఆ నేరానికి శిక్ష అనుభవించనివ్వండి. కనికరం అవసరంలేదు. కాని చెయ్యని హత్యానేరం, అందులోను, అటువంటి ఘోరమైన హత్యానేరానికి ఉరికంబం ఎక్కనివ్వకండి. న్యాయం, ధర్మం, నీతి ముఖ్యం అన్నారు. శిఖామణిని యెవరయినా రక్షించగలిగితే మీరే రక్షించగలరు" ఏడుస్తోంది.

"రాధా నువ్వు యిక్కడికి వచ్చినట్టు ఎవరికయినా తెలుసా?"

"పోలీసులకి తెలుసుండాలి. మఫ్టీలోవున్న పోలీసులు యిద్దరు నన్ను వెంటాడుతూనే వున్నారు. వాళ్ళు చూసి ఉంటారు."

"అలాగా - కాలేజీకి ఒక నెలరోజులపాటు నువ్వు శెలవు పెట్టడానికి ఆటంకం ఏమైనా వుందా?" అడిగాడు యుగంధర్.

"లేదు. చాలా శెలవు వుంది."

"అయితే యిక్కడినించే సెలవుకి ఉత్తరం వ్రాసి పోస్టు చెయ్యి. నువ్వు మళ్ళీ యింటికి వెళ్ళక. ఇక్కడే వుండు. కాత్యా! రాధకి యెటువంటి ఆపదా కలుగకుండా చూసుకోవడం నీ వంతు" అన్నాడు యుగంధర్.

"అంటే?" అడిగింది రాధ కళ్ళు తుడుచుకుంటూ.

"నేనేమి వాగ్దానం చెయ్యడంలేదు. దర్యాప్తు చేస్తాను. శిఖామణి నిజంగానే నిర్దోషి అయితే విడిపిస్తాను. అతను దోషి అయితే పోలీసుల కేసు మరింత పటిష్టం చేస్తాను" అంటున్నాడు.

అంతలో టెలిఫోన్ మోగింది. రాజు రిసీవర్ తీసుకున్నాడు.

"ఐ.జి మీతో మాట్లాడాలిట" అన్నాడు రాజు.

"హల్లో! యుగంధర్ హియర్."

"హల్లో! మీతో వెంటనే మాట్లాడాలి. నేనే వచ్చేవాణ్ణి, కానీ మన సంభాషణ చాలా ప్రయివేటు, అందువల్ల -"

"ఒకసారి రమ్మంటారు, అంతేగా, వస్తాను" అన్నాడు యుగంధర్.

"ఏమిటిసార్?" అడిగాడు రాజు.

"రథచక్రం అప్పుడే కదిలింది. ఐ.జి నాతో మాట్లాడాలిట. వెళ్ళి వస్తాను. జాగ్రత్త" అన్నాడు యుగంధర్.

## 8

"ప్రయివేటుగా మాట్లాడాలన్నారు" అన్నాడు యుగంధర్ నవ్వుతూ. డి.ఐ.జి.నీ, డిటెక్టివ్ యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావునీ చూసి.

"మనవారేగా, కూర్చోండి యుగంధర్. శిఖామణి భార్య రాధ మిమ్మల్ని కలుసుకున్నది. శిఖామణి నిర్దోషి అని, కల్పితాలయిన సాక్ష్యాలు సృష్టించి చెప్పింది. ఎంతయినా లిటరేచర్ ఎం.ఎ మంచి కల్పనాశక్తిగల ఆడది" అన్నాడు ఐ.జి నవ్వుతూ.

"మీ డిపార్టుమెంట్ ఆమెని ఒక కంట కనిపెడుతూనే ఉన్నారన్నమాట"

"అది సహజమే, అందులో ఆశ్చర్యం ఏముంది. రాధ మాటలు నమ్మి మీరు శిఖామణి కేసు పరిశోధన తీసుకోవద్దు."

"ఎందువల్ల?" అడిగాడు యుగంధర్.

"మీ టయిం వృధా అవుతుంది. శిఖామణి షీలా ముఖర్జీని హత్య చేశాడు. పటిష్టమైన కేసు తయారు చేశాము. నిర్దుష్టమైన సాక్ష్యం వుంది. పూనాలో పెట్రోలు పోయించుకున్న పెట్రోలు బంక్ గుమాస్తా శిఖామణిని ఐడింటిఫికేషన్ పరేడ్‌లో గుర్తుపట్టాడు. వేలిముద్రల విషయం జేబురుమాలు విషయం మీరు పత్రికల్లో చదివే ఉంటారు. ముఖర్జీగారి కుమారుడు రంజన్ కూడా శిఖామణిని గుర్తుపట్టాడు."

"అలాగా" అన్నాడు యుగంధర్.

"అంతేకాదు, యిప్పుడే వచ్చింది వార్త. శిఖామణి తప్పించుకుని పారిపోయాడు." అన్నాడు ఐ.జి.

"వాట్, మర్డర్ కేసులో అండర్ ట్రయిల్ పోలీసులు, జైలు అధికారులు చాలా జాగ్రత్తగా వుంటారే యెలా తప్పించుకున్నాడు?"

"శిఖామణి యిన్నేళ్ళు పోలీసులకి దొరక్కుండా ఎలా తప్పించుకుని తిరిగాడు? అతను చాలా ఘటికుడు. తను నిజమే చెపుతున్నాననీ, హత్య చెయ్యలేదనీ, కావలిస్తే 'లై' డిటెక్టర్ టెస్టు యివ్వమని అడిగాడట. అంత సాక్ష్యం వున్నా, లై టిటెక్టర్ టెస్టు కోరాడు కనుక బొంబాయి పోలీసు అంగీకరించి, జైలు నుంచి పోలీసు హెడ్ క్వార్టర్స్‌కి తీసుకెళుతుండగా, వాన్‌లో వున్న యిద్దరు పోలీసు కానిస్టేబుల్స్‌నీ కొట్టి, కారులోంచి దూకి పారిపోయాడు. పోలీసులు అతనికోసం మళ్ళీ గాలిస్తున్నారు" అన్నాడు ఐ.జి.

"ఇంతకన్నా సాక్ష్యం కావాలా! పారిపోతూ శిఖామణి, ఒక పోలీసు వద్ద వున్న పిస్తోలు తీసుకుపోయాడు. చాలా డేంజరస్ క్రిమినల్. పట్టుకోగలిగితే పట్టుకోమనీ లేకపోతే, షూట్ ఆన్ సైట్ అనీ ఆర్డర్స్ యిచ్చారు."

"ఎవరు?" అడిగాడు యుగంధర్.

"సి.బి.ఐ."

"తను నిర్దోషి కనుక, తనకి న్యాయం జరగదనే అపనమ్మకంతో అతను పారిపోయాడేమో" అడిగాడు యుగంధర్.

"మన కోర్టులు, మన కోర్టులలో జడ్జీలు ఎంత నిస్పాక్షికంగా ఉంటారో మీకు తెలుసు. అతను నిర్దోషి అయితే కోర్టులో నిరూపించుకోగలడు. పారిపోవలసిన అవసరం ఏముంది?" యెదురు ప్రశ్నవేశాడు ఐ.జి.

"అక్టోబర్ అయిదవతేదీ రాత్రి కరుప్పన్ అనే అతను బ్రాందీ తీసుకురావడం -"

"ఆ! ఆ! అన్నీ విన్నాను. అంతా అబద్ధం."

"ఆ డాక్టర్ పంకజరావుని అడిగారా?"

"లేదు, ఆ పంకజరావు ఏమయ్యాడో తెలియలేదు."

"అదేమిటి? రిజిష్టర్ మెడికల్ ప్రాక్టిషనర్. ఇంకో ఊరికి వెళ్ళి ప్రాక్టీసు పెట్టినా, పోలీసులు అతని జాడ యెంతసేపట్లో తెలుసుకోగలరు. దొంగలు గజదొంగలు, హంతకులయిన వారినే పట్టుకోగలిగిన పోలీసులు, ఒక డాక్టర్ యెక్కడున్నాడో తెలుసుకోలేకపోయారా?"

"అవును తెలుసుకోలేకపోయాము, ఆ రాత్రి తాగి వున్న శిఖామణికి మందిచ్చి, తాగివున్నాడని పోలీస్‌కి రిపోర్టు చెయ్యనందుకు మేము చర్య తీసుకుంటామనీ, ప్రస్తుతానికి ప్రాక్టీసు మానేసి, ఏ మారుమూల ఊళ్ళోనో దాక్కుని వుంటాడని నా అనుమానం."

"డాక్టరు పారిపోయి వుండవచ్చు. కాంపౌండర్, గేటు జవాను."

"వాళ్ళని తన కూడా తీసికెళ్ళాడేమో!"

"ప్రాక్టీసు చెయ్యని డాక్టరుకి కాంపౌండర్ ఎందుకు?"

"మిస్టర్ యుగంధర్, నన్ను మీరు క్రాసు పరీక్ష చేసి ప్రయోజనం లేదు. ఉన్న విషయాలు చెప్పాను. శిఖామణి తను షీలా ముఖర్జీని హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. స్టేట్‌మెంట్ యిచ్చాడు. మీరు టయిం వృధా చేసుకోవద్దని చెప్పాను. ఆ తర్వాత మీ యిష్టం -" అన్నాడు ఐ.జి విసుగ్గా.

"మీ సలహాకి థాంక్స్. నా టయిం వృధా అవుతుందో కాదో నేను తర్వాత తెల్సుకుంటాను. గుడ్‌నైట్" అని యుగంధర్ లేచాడు.

యుగంధర్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు కారు వరకూ వెళ్ళాడు. "ఏమిటి ఇన్‌స్పెక్టర్?" అడిగాడు యుగంధర్.

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యిబ్బందిగా అటూ ఇటూ చూసి, "యుగంధర్ గారూ! మనం చాలా కాలంనించి మిత్రులం. నా సలహా పాటించండి. ఈ శిఖామణి కేసు జోలికి పోవద్దు. మంచిదికాదు" అన్నాడు. "ఎవరికి మంచిదికాదు?" అడిగాడు యుగంధర్.

"మీకే -"

"ఎందువల్ల?" అడిగాడు యుగంధర్.

"దయచేసి యింకేమీ అడగకండి ప్లీజ్. నా మాట నిర్లక్ష్యం చెయ్యకండి" అన్నాడు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments